క్లుప్తంగా

రహదారి విస్తరణలో జాప్యం

అశ్వాపురం: మండల కేంద్రంలో మణుగూరు –కొత్తగూడెం ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనుల ప్రారంభంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మండల కేంద్రంలో రూ.4కోట్లతో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైయినేజీ, రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు 05 డిసెంబర్ 22న శంకుస్థాపన చేశారు. డ్రైయినేజీ పనులు నత్తనడకన సాగి పూర్తయ్యాయి. రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించడం లేదు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వాహనాల రద్దీతో వ్యాపారులు, స్థానికులు, వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్బీ అధికారులు స్పందించి రహదారి విస్తరణ పనులపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

తుమ్మలను కలిసిన అధికారులు


మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న వివిధ శాఖల అధికారులు

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలోని నివాసంలో మంత్రి తుమ్మలను, ఆయిల్ ఫెడ్, వ్యవసాయ శాఖల అధికారులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున, పట్టాదారు పాసు పుస్తకాలు లేకపోయిన, భూమి సాగుదారులకు పామాయిల్ మొక్కలను అందజేయాలని ఆయిల్ ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణకు సూచించారు. పండుగ సందర్భంగా కోడి పందేలను నిర్వహించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పోలీసు అధికారులను ఆదేశించారు.

ఊళ్లకు వెళ్లేవారు సమాచారమివ్వాలి

మణుగూరురూరల్: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఊళ్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని మణుగూరు సీఐ రమాకాంత్ తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావుల ఆదేశాల మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఊళ్లకు వెళ్లే వారు 6300392272 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వారి పూర్తి వివరాలను, గూగుల్ లోకేషన్‌ను పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. దీనివల్ల ఆయా ఏరియాల్లో ప్రత్యేక పోలీస్ బృందాలు గస్తీ చేయడం జరుగుతుందన్నారు. ఊళ్లకు వెళ్లేటప్పుడు తమ బంగారు, వెండి ఆభరణాలను, విలువైన వస్తువులను సాధ్యమైనంతవరకు వెంట తీసుకెళ్లాలని, నాణ్యమైన తాళాలను వేయాలని సూచించారు. ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు ఇంటి పరిసరాల్లో సంచరిస్తే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేకు అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాను సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

‘బీజేపీతో మతోన్మాదం’

భద్రాచలంటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యార్థులను మతోన్మాదులుగా తయారు చేస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు జె.మంజుల విమర్శించారు. భద్రాచలం పట్టణంలోని కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీజేపీ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ వాస్తవ భౌతిక పరిస్థితుల నుంచి విద్యను దూరం చేస్తూ మూఢనమ్మకాలను పెంచి పోషించే విధంగా విద్యా రంగాన్ని రూపు దిద్దుతూ మతపురంగును పులుముతుందని ఆరోపించారు. తెలంగాణాలో గత ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తి స్థాయిలో విఫలమైందని, నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాంబ, గణేష్, ప్రణయ్, ప్రియాంక, చరణ్, సంతోష్, అంజుమ్, సింధు తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్రలను ఉద్యోగులుగా గుర్తించాలి

చండ్రుగొండ: గోపాలమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు శనివారం వినతిపత్రం అందించారు. గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారేను కలిసి గోపాలమిత్రలు రెండుదశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు ఆకుల శ్రీనివాసరావు, వై.రాము, సతీష్, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘పతంగుల’ పండుగ వచ్చేసింది!

- సంక్రాంతి వేళ గాలిపటాల సందడి
- ఆకట్టుకుంటున్న రంగు రంగుల పతంగులు
- జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదమే..



సండే స్పెషల్

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఏటా సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. పతంగుల పండుగ సందడి చేస్తోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా రంగు రంగుల పతంగులు ఆకాశంలోకి ఎగురవేస్తూ, సందడి చేస్తుంటారు. ప్రతి ఏడాది గాలి పటాలకు ఆదరణ పెరుగుతుండగా, తాజాగా సంక్రాంతి నేపథ్యంలో వీటిపై ప్రత్యేక కథనం..

గాలి పటాలకు ఉన్న ప్రత్యేకత, చరిత్ర ఇప్పటిది కాదు. దాదాపు రెండు వేల ఏళ్ల నాటి కింద నుంచే వీటిని ఉపయోగిస్తూ వస్తున్నారు. తొలిసారిగా వీటిని చైనా దేశంలో తయారీ చేయగా, తొలి దశలో వీటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సమాచారాన్ని చేరవేసేందుకు, ఆ తర్వాత సైనిక అవసరాలకు ఉపయోగించే వారట. చైనా మొదలైన గాలి పటాలు క్రమంగా వివిధ దేశాలకు విస్తరించగా, మన దగ్గర సంక్రాంతి పండుగ సెలవుల్లో యువతి, యువకులు, చిన్నారులు, పెద్దలు తారతమ్యం లేకుండా వీటిని ఎగురవేస్తున్నారు. సంక్రాంతి సీజన్‌లోనే గాలి పటాలను ఎగుర వేసేందుకు ముఖ్య కారణంగా జనవరి మాసంలో గాలి పటాలు ఎగుర వేయడానికి అనుకూలమైన వాతారణం ఉండటమే కారణం. గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటం, నిరంతరాయంగా ఒక వైపు నుంచి మరో వైపుకు గాలులు వీస్తుండటం వల్ల రంగు రంగుల పతంగులు ఏలాంటి ఇబ్బంది లేకుండా ఎగురుతాయి. ఈ పతంగుల పండుగను పల్లె, పట్టణాలు తేడా లేకుండా యవతి, యువకులు, చిన్నారులు, పెద్దలు ఎగుర వేస్తూ సందడి చేస్తుంటారు.

విభిన్న రూపాల్లో గాలిపటాలు..

పూర్వ కాలంలో పేపర్, సాధారణ దారంతో గాలి పటాలను తయారీ చేస్తే, వాటినే అత్యధికంగా వినియోగించే వారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే గాలి పటాలను పెద్దలు కాగితాలతో స్వంతంగా తయారీ చేసి పిల్లలకు అందించే వారు. కానీ గత కొన్నేళ్లుగా గాలి పటాలు మార్కెట్‌లోకి అందుబాటులోకి రాగా, విభిన్న రీతుల్లో వాటిని తయారీ చేసి అందుబాటులో ఉంచుతున్నారు. వివిధ ఆకారాలు, సినిమా హీరో, హీరోయిన్లు, ప్రముఖ రాజకీయ, క్రికెటర్ల చిత్రలతో కూడిన గాలి పటాలు సైతం మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీటిని ఎగుర వేసేందుకు ప్రత్యేకంగా దారం, మాంజాలు సైతం అందుబాటులో ఉంటున్నాయి. విభిన్న రీతుల్లో తయారీ చేసిన పతంగులు ఆకాశంలో ఎగురుతూ చూపరులను కనువిందు చేస్తున్నారు. చిన్నారులు, యువకులు వీటిని ఎగుర వేస్తూ గంటల తరబడి ఆనందంగా గడుపుతున్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే సంతోషం..

సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకునేందుకు పతంగులను కొన్ని జాగ్రత్తలు పాటించాలి. నిర్లక్ష్యం, అజాగ్రత్త వహిస్తే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు సైతం గాల్లో కలిసే ప్రమాదం లేకపోలేదు. కొన్ని జాగ్రత్తలు ఇవీ..

- విశాలమైన ఖాళీ ప్రదేశాలు, మైదానాల్లో గాలి పటాలను ఎగుర వేస్తే ఏలాంటి ప్రమాదమూ జరిగే అవకాశం ఉండదు.
- భవనాలు, ఇరుకు డాబాలు, పిట్ట గోడలు లేని భవనాలపై గాలి పటాలను ఎగుర వేయకుండా జాగ్రత్తలు పాటించాలి.
- గాలి పటాలు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెట్లకు చిక్కుక్కున్న సమయంలో వాటిని అక్కడే వదిలేయాలి. వాటిని తీసేందుకు ప్రయత్నిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయి.
- పతంగుల దారాలను చేతితో జాగ్రత్తగా పట్టుకోవాలి, గట్టిగా పట్టుకుంటే ఒకొక్కసారి చేతి వేళ్లు తెగి గాయాలవుతాయి.
- చిన్నారులు గాలి పటాలు ఎగురవేసే సమయంలో తప్పనిసరిగా వారి తల్లిదండ్రులు దగ్గరే ఉంటూ, జాగ్రత్తపడాలి. ఎట్టి పరిస్థితుల్లోనే చిన్నారులను గాలి పటాలు ఒంటరిగా వదలొద్దు.

విద్యుత్ తీగలతో జాగ్రత్త



సంక్రాంతి పండుగ నేపథ్యంలో గాలి పటాలను విద్యుత్ తీగల వద్ద ఎగుర వేయవద్దు. పతంగులను ఎగరేసే క్రమంలో మాంజా దారం విద్యుత్ వైర్లకు చిక్కుకుని ఒక్కక్కసారి విద్యుదాఘాతాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద గాలి పటాలు చిక్కుకుంటే వాటిని తీసే ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లో కూడా చేయొద్దు. తల్లిదండ్రులు గాలి పటాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే ప్రాణ నష్టం జరుగుతుంది.

– బి.వెంకటేశ్వర్లు, ఏడీఈ, ట్రాన్స్‌కో, అశ్వారావుపేట

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు


వాహన తనిఖీలు చేపడుతున్న డీఎస్పీ వెంకటేష్

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ పేరుతో కోడి పందేలు, పేకాట, జూదం వంటివి నిర్వహిస్తే సహించేది లేదన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. అదే విధంగా మద్యం మత్తులో వాహనాలు డ్రైవ్ చేయడం, అతి వేగంగా వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని తెలిపారు. అనంతరం డీఎస్పీ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, దమ్మపేటలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ కరుణాకర్, ఎస్సైలు పి.శ్రీకాంత్, శివరామకృష్ణ ఉన్నారు.

క్రీడా స్ఫూర్తి అవసరం

కరకగూడెం: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని తాటిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ కొమరం విశ్వనాథం, కరకగూడెం ఏఎస్సై సాళ్ల పాపయ్య అన్నారు. శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తాటిగూడెం గ్రామంలో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడుతూ.. యువత లక్ష్యసాధనకు నడుం బిగించాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు కొమరం కాంతారావు, సతీష్, వెంకట్, బాబురావు తదితరుల పాల్గొన్నారు.

ఆసక్తిని పెంచుకోవాలి

బూర్గంపాడు: యువత తప్పనిసరిగా క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా అంజనాపురం గ్రామంలో స్థానిక యువత నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించటం హర్షణీయమన్నారు. యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ టోర్నమెంట్‌లు ఉపయోగపడతాయన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటుగా మానసిక వికాసం వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూక్యా ఆనంద్‌రావు, రామారావు, బికారి భాస్కర్, చంటి, లింగ తదితరులు పాల్గొన్నారు.


కరకగూడెం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఎస్సై, సర్పంచ్

హక్కుల సాధనకు కృషి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరి త్యాగరాజన్

మణుగూరురూరల్: సింగరేణి కార్మికుల హక్కుల కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరి సి.త్యాగరాజన్ పిలుపునిచ్చారు. ఏరియాలోని మణుగూరు ఓసీ గనిలో జరిగిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని ప్రాతినిధ్య సంఘంగా ఎన్నుకున్న కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తుందని తెలిపారు. కొత్త గనుల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కొత్త గనుల ఏర్పాటు కోసం పోరాడేందుకు ఐఎన్‌టీయూసీ ముందుంటుందని, గనులు ఏర్పాటైతే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం లభిస్తుందని అన్నారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సోమరాజు, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, నాయకులు బి.రాజలింగు, మంతెల బాలకృష్ణ, కుమార్, రవి, ముజాహిద్దీన్, ఆగయ్య, ఓదెలు, సూరయ్య, లాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వైద్యశిబిరం

చర్లరూరల్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం చర్ల మండలంలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని రామచంద్రాపురం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 80 మందికి పరీక్షలు నిర్వహించారు.అనంతరం వారికి కావలసిన మందులను పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ చంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ జి.రాజారెడ్డి, సెక్రటరీ వై.భానుప్రసాద్, వై.సూర్యనారాయణ, రవి కుమార్, శ్రీలత, పరమేష్, మారుతి నర్సింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవాలి

చండ్రుగొండ: కులమతాలకు అతీతంగా పేదలు ఎవరైనా వారిని అన్ని విధాల కులసంఘాలు చేయూత అందించాలని ఎస్సై మాచినేని రవి అన్నారు. మండలకేంద్రం చండ్రుగొండలో శనివారం మున్నూరు కాపుసంఘం ఆధ్వరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలండర్‌ను ఎస్సై రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కార్యక్రమంలో మున్నూరు కాపుసంఘం మండల అధ్యక్షుడు రామిశెట్టి సైదయ్య, నాయకులు వెలగల మధు, లంకా నర్సింహారావు, శెట్టిపల్లి కృష్ణయ్య, పులి సత్యం, జ్యోతి దర్గయ్య, భూపతి శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, లక్ష్మీపతి, నవీన్, సందీప్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చర్లరూరల్: చర్ల మండలం కలివేరు గ్రామానికి చెందిన కారం సావిత్రి పుట్టుకతోనే పోలియో వ్యాధిగ్రస్తురాలు. ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడడంతో చేయి విరిగింది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా.. చర్లలోని మీకోసం మేమున్నాం టీంను సంప్రదించింది. వారి ద్వారా పలువురు దాతలు స్పందించారు. ఈ విషయాన్ని వాట్సాప్ గ్రూపు ద్వారా తెలుసుకున్న భద్రాచలం గిరిజన గురుకులంలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న తోటమళ్ల బాలయోగి శనివారం సావిత్రి నివాసానికి వెళ్లి తన వంతు సాయంగా రూ.1000, పండ్లను అందించారు. అవసరమైతే ఆపరేషన్ కోసం భద్రాచలంలోని వైద్యులతో మాట్లాడుతానని బాలయోగి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో తోటమళ్ల సురేష్ బాబు,గుమ్మలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

అశ్వారావుపేటరూరల్: ఆర్యవైశ్య సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శీమకుర్తి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. శనివారం మండలంలోని వినాయకపురం గ్రామంలోగల ఓ ఫంక్షన్ హాల్ ఆవరణలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీనివాసరావును శాలువా కప్పి సన్మానించారు. జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బిర్రం వెంకటేశ్వరరావు, ఉప్పల మురళి, పొట్టా రాజులు, లోకం సాంబశివరావు, మారుతీ లక్ష్మణరావు, ఉప్పల ప్రసాద్, వీర్నాల హరిప్రసాద్, వీరబాబు, మారుతీ వసంతరావు, బేతి రాజశేఖర్, కక్కిరాల నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారే పర్యటన


అశ్వారావుపేటరూరల్: నారాయణపురంలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మామిళ్ల వారిగూడెం, నారాయణపురంలో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. మామిళ్లవారిగూడెంలో జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. నారాయణపురంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో గాండ్లగూడేనికి చెందిన కునసోతు నాగేశ్వరరావు కుటుంబీకులకు వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.లక్షా 50వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మొడియం నాగమణి, కంగాల పరమేష్, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, నారదాసు రామారావు, మాలోతు అలీ, నండ్రు రమేష్, అల్లాడి రామారావు పాల్గొన్నారు.

పరామర్శ..

ములకలపల్లి: మండలంలోని కలమలాపురం గ్రామానికి చెందిన నాగళ్ల పిచ్చయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆయన భౌతిక కాయానికి పూలమాలతో నివాళర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మువ్వా విజయబాబు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, సర్పంచ్ కారం సుధీర్, అడపా నాగేశ్వరరావు, తాండ్ర ప్రభాకరరావు, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పలువురిని పరామర్శించారు. శనివారం మండల పరిధిలోని చలమప్పగూడెం గ్రామంలో ఇటీవలే మృతి చెందిన తాటి మల్లప్ప చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెడ్యాలపాడు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బండారు సత్యనారాయణ సతీమణిని పరామర్శించారు. ముష్టిబండ గ్రామంలో ఇటీవలే మృతి చెందిన అడపా బుజ్జి చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవలే వచ్చిన తుపాన్ కారణంగా ముకుందాపురం గ్రామంలోని బొబ్బసు కుంట కోతకు గురికాగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, యువ నాయకులు రావు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలు కాలనీలలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన సంక్రాంతి సంబురాల నేపథ్యంలో ముగ్గుల పోటీలను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఒక్కరోజు ముందుగానే ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది భోగి మంటలను వేసి ఉత్సాహంగా ఆడిపాడారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రవిబాబు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, దేవరాజు, విజయరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే

చర్లరూరల్: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామంలోని గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి మొక్కు తీర్చుకున్నారు. భద్రాచలం నుంచి గెలుపొందితే 101 కొబ్బరికాయలు కొడతామని గ్రామస్తులు మొక్కుకోవడంతో ఆ మొక్కును తీర్చారు.

పరామర్శ..

ఇటీవల చర్లలో మృతి చెందిన ధనికొండ అనసూయ కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రగ్గుల పంపిణీ


ఆదివాసీలకు రగ్గులను పంపిణీ చేసిన ఎస్సై

ములకలపల్లి: పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థ సహకారంతో ఆదివాసీ ప్రజలకు రగ్గులు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని ఆదివాసీ గ్రామాలు అయిన కొమరంభీమ్ నగర్, ఊట చెరువు గిరిజనులకు, పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థ సహకారంతో, కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చలి తీవ్రత కారణంగా గిరిజనులకు రగ్గులను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బైటి రాజేష్, పుష్పాల చంద్రరావు, హనుమంతరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో రోడ్డు ప్రమాదాలు

- వరుస ఘటనలతో పెరుగుతున్న కేసులు
- కొంపముంచుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం


మద్యం మత్తులో డ్రైవింగ్ కారణంగా తేగడ వద్ద వంతెన రైలింగ్‌ను ఢీకొట్టిన లారీ (ఫైల్)

చర్ల: ఏజెన్సీలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయి. మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న యువతతో పాటు రోడ్లపై ప్రయాణిస్తున్న సామాన్యుల ప్రాణాలు రోడ్డు ప్రమాదాల్లో గాలిలో కలుస్తున్నాయి. ఇటీవల కాలంలో చర్ల మండలంలో చోటుచేసుకున్న ప్రమాదాలన్నీ దాదాపు మద్యం సేవించిన వ్యక్తులు వాహనాలను నడపడం వల్లే జరిగినట్లుగా తెలుస్తోంది. మద్యం మత్తులో వాహనాలను నడపడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఈ ప్రమాదాల నియంత్రణకు పోలీసుశాఖ చర్యలు చేపట్టాలని ఏజెన్సీ జనాంగం కోరుతోంది. మద్యం సేవించి వాహనాలను నడిపై వారిపై చర్యలు తీసుకోకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో యువత చిత్తుగా మద్యం సేవిస్తూ ద్విచక్రవాహనాలపై అవసరం లేనప్పటికీ చెక్కెర్లు కొడుతూ వాయువేగంతో వాహనాలను నడుపుతున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్నారు. చిత్తుగా మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న వారి వాహనాల రాకను గమనిస్తున్న కొందరు వారి వాహనాలకు దూరంగా వెళ్తూ తప్పించుకుంటూ ప్రాణాలను కాపాడుకుంటున్నారు. మరి కొందరు ప్రమాదాల బారిన పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఇటీవల చర్ల మండలంలోని తేగడ, కుదునూరు గ్రామాలల్లో జరిగిన ప్రమాదాలలో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఇవే కాకుండా నిత్యం మండలంలోని ఏదో ఒక గ్రామంలో ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉండగా ఘటనలు భయటకు రాకుండా మందుబాబులు క్షతగాత్రులతో షెటిల్‌మెంట్స్ చేసుకుంటున్నారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం వల్లే నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఉండగా, మద్యం సేవించి వాహనాలను నడిపై వారిని గుర్తించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. మందుబాబులపై చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని వేడుకుంటున్నారు.

చర్యలు తప్పవు



మద్యం సేవించి వాహనాలను నడిపే వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా తనిఖీలు చేపడతాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమయిన పలువురిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. ఇకపై కూడా అలాంటి వారు పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతాం.

– బి.రాజగోపాల్, చర్ల సీఐ